
# సత్యవాక్కు

# the word of truth



క్రైస్తవ మాసపత్రిక

JULY 1997

## సంక్షిప్త వార్తలు

జూన్ 18వ తేదీ బుధవారం మధ్యాహ్నం కర్నాటక రాష్ట్రములో, రాయచూర్ జిల్లా కనకగిరినుండి కాకినాడకు ప్రయాణం చేసి సోదరి ఛాయాదేవిగారు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఆమె భర్తగారు ఆ ఊరిలోని కనకాచలపతి ఆలయములో పూజారిగా (అర్చక్‌గా) పనిచేయుచున్నారు. 23 సంవత్సరముల క్రితము సత్యవాణి ప్రారంభమైన రోజుల్లోనే ఛాయాదేవిగారు క్రీస్తుకొరకు ఆయన సంఘముకొరకు ఆకర్షింపబడి, అనేక శోధనలను ఎదుర్కొని, తన విశ్వాసాన్ని కాపాడుకొనుచు బాప్తిస్మము పొందుట ద్వారా తనయొక్క విధేయతను సంపూర్తి చేసారు. అనేకులకు మంచి మాదిరి నెలకొల్పారు. దేవుడు సోదరి ఛాయాదేవిగారిని, వారి కుటుంబమును ఆశీర్వదించునట్లు ప్రార్ధించమనవి.

జూన్ 22వ తేదీ ఆదివారం మధ్యాహ్నం బెండపూడిలోని క్రీస్తుసంఘమును జాషువా గూటంగారు దర్శించి వాక్యపరిచర్యచేసిరి. అక్కడ సోదరులు పులగల సమర్పణరావ్‌గారు వాక్యపరిచర్య చేయుచున్నారు. బెండపూడి క్రీస్తుసంఘము ఒకమంచి ఆలయమును కూడా నిర్మించుచున్నారు. సాధ్యమైనంత త్వరలో అది పూర్తి కాగల్గునట్లు ప్రార్ధించమనవి.

జూన్ 26వ తేదీ గురువారం సాయంత్రం విజయవాడలోని ముత్యాలపాడులో స్థానిక క్రీస్తుసంఘము తమ స్వయంకృషితో నిర్మించుకొనిన ఆలయమునురిబ్బను కత్తిరించుట ద్వారా జాషువాగూటం గారు ప్రారంభించారు. ఆ స్థానిక సంఘములో పి. అబ్రాహాముగారు గత కొన్ని సంవత్సరాలుగా నిర్విరామకృషి సల్పుచూ దేవుని కొరకు ఆత్మలను సంపాదిస్తూ మంచి సంఘమును తయారుచేయ గలిగారు. ఆరోజు జరిగిన కూటమునకు కె.రాజ్‌కుమార్‌గారు అధ్యక్షత వహించగా జాషువాగూటం గారు వాక్యపరిచర్య చేసారు. కూటం అనంతరం సోదరి రమాదేవిగారు బాప్తిస్మము పొందారు. సోదరులు పి.అబ్రాహాముగారు ఉద్యోగం చేస్తూ, క్రీస్తు పరిచర్యలో సాగుచున్నారు. వారికొరకు, ముత్యాలపాడు క్రీస్తుసంఘము కొరకు ప్రార్ధించుదాం.

జూన్ నెల సువార్తికులసదస్సు 27వ తేదీన కొల్లివారిపేట, పుల్లేటికుర్రులో క్షేమాభివృద్ధికరంగా జరిగెను. ప్రశాంతమైన వాతావరణమును దేవుడనుగ్రహించగా

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

Phone : 0884-63722

**Editor :** **J.C.CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 17 | జూలై 1997 | సంచిక 12


## సంపాద కీయం

## క్రైస్తవులు ఆదివారముననే ఏల ఆరాధింతురు?

## ( Why Do Christians Worship upon the First day of the Weeek ? )

ప్రభువైన యేసుక్రీస్తు సంఘము క్రమముగా ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడుకొనును. ఆ సమయమందు వారు ప్రభురాత్రి భోజనములో పాలుపొందుదురు. మన పాపముల నిమిత్తము క్రీస్తు చనిపోయిన సంగతికి జ్ఞాపకార్థముగా దీనిని జరిగింతురు. దేవుని వాక్యము ఆరాధనలో బోధింపబడును.వారు దేవుని ప్రార్థింతురు, కీర్తనల ద్వారా ఆయనను స్తుతింతురు. మరియు దేవునికి కానుకల నర్పింతురు. ఆదివారమున కొన్ని ప్రాముఖ్య సంఘటనలు సంభవించినందున క్రీస్తు సంఘము ఆదివారమున ఆరాధనకు కూడుకొనును.

మన ప్రభువును, రక్షకుడునైన యేసుక్రీస్తు మృతులలోనుండి ఆదివారమున తిరిగి లేచెను. "ఆదివారము తెల్లవారినప్పుడు యేసులేచి, తాను ఏడు దయ్యములను వెళ్లగొట్టిన మగ్దలేనే మరియకు మొదట కనబడెను" (మార్కు 16:9; మత్తయి 28:1-8; లూకా 24:1-12; యోహాను 20:1-10). క్రీస్తుయొక్క పునరుత్థానము

క్రైస్తవులకు చాల ప్రాముఖ్యమైనది. యేసుక్రీస్తు దేవుని కుమారుడని నిస్సందేహముగా అది నిరూపించుచున్నది. మరియు మనము కూడ తిరిగి లేపబడుదుమనే నిర్ధారణను అది మనకిచ్చుచున్నది (1కొరింథీ 15చదువుము).

పరిశుద్ధాత్ముడు అపొస్తలులపై ఆదివారమున దిగెను. "పెంతెకొస్తను పండుగ దినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడియుండిరి. అప్పుడు వేగముగా వీచుబలమైన గాలి వంటి యొక ధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా, వారు కూర్చుండి యున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్ని జ్వాలల వంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ, అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మవారికి వాక్శక్తి అనుగ్రహించిన కొలది అన్యభాషలతో మాట్లాడసాగిరి" (అపొ.కా. 2:1-4).

పెంతెకొస్తు అనగా 50 దినములు యని యర్థము. పెంతెకొస్తు యూదుల యొక్క ఒక ప్రత్యేక పండుగ. పస్కా పండుగ అయిన 50 దినముల తరువాత అది వచ్చును. అది కోత పండుగ యని, ప్రథమ ఫల పండుగ యని కూడ పిలువబడేది. మరియు వారముల పండుగ యని కూడ అది పిలువబడేది. ఏలయనగా అది ఏడు వారముల తరువాత వచ్చును. "మీరు విశ్రాంతి దినమునకు మరునాడు మొదలుకొని, అనగా అల్లాడించు పనను మీరు తెచ్చిన దినము మొదలుకొని, యేడు వారములు లెక్కింపవలెను. లెక్కకు తక్కువ కాకుండ ఏడువారములు ఉండవలెను. ఏడవ విశ్రాంతి దినపు మరుదినమువరక మీరు ఏబడి దినములు లెక్కించి యెహోవాకు క్రొత్త ఫలముతో నైవేద్యము అర్పింపవలెను" (లేవీ 23:15,16). శనివారము సబ్బాతు దినము గనుక, అది వారములో ఏడవ దినము గనుక, సబ్బాతు మరుసటి దినము ఆదివారమగును (నిర్గమ 20:9,10).

క్రీస్తు సంఘము అట్టి పెంతెకొస్తు దినమున పరిశుద్ధాత్ముడు అపొస్తలులపై దిగినప్పుడు ఆరంభమాయెను. ఆదినమందు వారు సువార్తను బోధించిరి. ప్రజలు సువార్తను వినిరి, విశ్వసించిరి. మారుమనస్సు బొందిరి. మరియు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. వారు ప్రభువుచే ప్రభువు యొక్క సంఘమందు

చేర్చబడిరి (అపొ.కా. 2:36-47). అట్లు క్రీస్తుసంఘము వారములో మొదటి దినమున, అనగా ఆదివారమున ఆరంభమాయెను.

ఆదిమ సంఘము క్రీస్తును జ్ఞాపకముంచు కొనుటకుగాను వారములో మొదటి దినమున కూడుకొనెను, "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్లనైయుండి వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడు చుండెను" (అపొ.కా. 20:7). పౌలు యెరూషలేముకు వెళ్లవలెనని ఆసక్తి కలిగియుండెను (అపొ.కా 20:16). అయినను అతడు త్రోయకు వచ్చినప్పుడు ఏడు దినములు అక్కడ ఉండెను (అపొ.కా. 20:6). అతడు అక్కడ సంఘముతో కలిసి ఆరాధించు నిమిత్తము ఆదివారము కొరకు కనిపెట్టుచుండెను.

ఆదిమ క్రైస్తవులు ఆదివారమున రొట్టె విరచుటయేగాక, మిగతా ఆరాధన క్రియలను తాము కూడి వచ్చినప్పుడు జరిగించిరి. క్రైస్తవులు ఆదివారమున కానుకల నీయవలెనని ఆజ్ఞాపింపబడిరి. "నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను" (1కొరింథీ 16:2). ఆదివారమున సమాజముగా కూడుట మానవలదని క్రైస్తవులు ఒకరినొకరు హెచ్చరించుకోవలెను (హెబ్రీ 10:25).

"మీరు వెళ్లి సమస్తజనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మని యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమియ్యుడి" యని యేసు తన శిష్యుల నాజ్ఞాపించెను (మత్తయి 28:19). బాప్తిస్మము పొందిన వారు యేసు ఆజ్ఞాపించిన సంగతులన్నీ వారును గైకొనవలెనని బోధింపబడాలి (మత్తయి 28:20). ఆదిమ క్రైస్తవులు ఆదివారమున రొట్టెవిరుచుట మనము గమనించినప్పుడు, అపొస్తలులు వారికి అట్లు బోధించారని మనం గ్రహించుకోవచ్చును. ఈరోజు మనము నిజమైన క్రీస్తు సంఘముగా యుండాలంటే ఈ మాదిరిని తప్పక అనుసరించాలి.

## సబ్బాతు ఆచరణ సంగతి యేమిటి ?

మనము 7వ దినమును ఆరాధన దినముగా ఆచరించాలని చెప్పేవారు

ఈనాడు కొందరున్నారు. క్రైస్తవులు ఆదివారమున ఆరాధించాలని సూచించే వాస్తవాలన్నీ వారు విస్మరిస్తారు.

ఏడవ దినమున ఆరాధించువారు, సబ్బాతును దేవుడు ఇశ్రాయేలీయులకు మాత్రమే ఆజ్ఞాపించెనను సంగతిని గ్రహించరు! క్రైస్తవులు దానినాచరించాలని దేవుడు ఎన్నడు కోరలేదు. సబ్బాతు దేవునికిని ఇశ్రాయేలీయులకును మధ్య ఒక సూచనయై యుండెను. "మరియు యెహోవా మోషేతో ఇట్లనెను: నీవు ఇశ్రాయేలీయులతో, నిజముగా మీరు నేను నియమించిన విశ్రాంతి దినములను ఆచరింపవలెను; మిమ్మును పరిశుద్ధపరచు యెహోవాను నేనే అని తెలిసికొనునట్లు అది తరతరములకు నాకును, మీకును గురుతగును" (నిర్గమ 31:12,13).

సబ్బాతును గూర్చిన ఆజ్ఞ మొదటిగా సీనాయి కొండవద్ద ఇశ్రాయేలీయులకు ఇయ్యబడెను. పదియాజ్ఞలలో అది నాలుగవది (నిర్గమ 20:8-11). ఇశ్రాయేలీయులు సీనాయి కొండ వద్ద బస చేసినప్పుడు దేవుడు మన్నాను పంపుట కారంభించెను. ఏడవ దినమున మన్నా వారికి లభ్యము కానందున ఆరవదినమున వారు రెండంతలు దాన్ని కూర్చుకొనవలెనని దేవుడు వారికి చెప్పెను. సబ్బాతును గూర్చిన ఆజ్ఞను వారికీయబోవుచున్నాడు గనుక దేవుడు వారికి అట్లు చెప్పెను. అది జరిగిన కొన్ని వందల సంవత్సరముల తరువాత, నెహెమ్యా సబ్బాతు సీనాయి వద్ద తెలియజేయబడెనని చెప్పెను: "సీనాయి పర్వతము మీదికి వచ్చి ఆకాశము నుండి వారితో మాటలాడి, వారికి నీతియుక్తమైన విధులను సత్యమైన ఆజ్ఞలను మేలుకరములైన కట్టడలను దయ చేసితివి. వారికి నీ పరిశుద్ధమైన విశ్రాంతి దినమును ఆచరింపనాజ్ఞ ఇచ్చి నీ దాసుడైన మోషే ద్వారా ఆజ్ఞలను, కట్టడలను ధర్మశాస్త్రమును వారికి నియమించితివి" (నెహెమ్యా 9:13,14).

సృష్టిలోనే దేవుడు సబ్బాతును గూర్చిన ఆజ్ఞ యిచ్చెనని కొందరు వాదింతురు. ఆదికాండము 2:3 ఇట్లు చెప్పుచున్నది: "కాబట్టి దేవుడు ఆ యేడవ దినమును ఆశీర్వదించి పరిశుద్ధ పరచెను; ఏలయనగా దానిలో దేవుడు తాను చేసినట్టియు సృజించినట్టియు తన పని అంతటినుండి విశ్రమించెను". దేవుడు సృష్టిపనినుండి ఏడవ దినమున విశ్రమించెననుటలో సందేహములేదు. ఆయన ఏడవ దినమును

పరిశుద్ధ పరచెననుట కూడ నిస్సందేహము. అయితే విశ్రాంతి దినమును పరిశుద్ధ దినముగా ఆచరించవలెనని ఆయన మానవులకు ఎప్పుడు ఆజ్ఞాపించెను? ఆదాము నోవహు, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు మొదలైన వారు దాని నాచరించినట్లు ఎక్కడా కనబడదు. ఇశ్రాయేలీయులు సీనాయికి వచ్చువరకు అట్టి యాజ్ఞకనబడదు. ఇశ్రాయేలీయులకును దేవునికిని మధ్య సబ్బాతు ఒక గురుతని జ్ఞాపకముంచు కొనవలెను. అది దేవునికి పితరులకును మధ్య ఒక గురుతు కాదు, అది దేవునికి అన్యజనులకు మధ్య ఒక గురుతుకాదు. అది దేవునికి క్రైస్తవులకు మధ్య ఒక గురుతు కాదు. సబ్బాతు దేవునికి ఇశ్రాయేలీయులకు మధ్య మాత్రమే గురుతు (నిర్గమ 31:13).

దేవుడు సబ్బాతును ఎప్పుడు ప్రత్యేక పరచెను? సీనాయి వద్ద దాన్ని ప్రత్యేక పరచెను (నిర్గమ 20:8-11). పాత నిబంధనలోని మొదటి ఐదు పుస్తకములను మోషే వ్రాసెను. సృష్టి జరిగిన కొన్ని వందల సంవత్సరముల తరువాత అతడు ఆదికాండమును వ్రాస్తు దేవుడు సబ్బాతును ఎందుకు పరిశద్ధ పరచెనో వివరించెను. ఆ దినమందు ఆయన తన సృష్టిపనినుండి విశ్రమించెను గనుక దానిని పరిశుద్ధ పరచెను.

## క్రొత్త నిబంధన

నేడు క్రైస్తవులు దేవుడు సీనాయి వద్ద ఇశ్రాయేలీయుల కిచ్చిన ధర్మశాస్త్రము క్రిందలేరు. ఈ ధర్మ శాస్త్రము అమలులో యున్నప్పుడే దేవుడు ఒక క్రొత్త నిబంధనను చేయుదునని ప్రవక్తయైన యిర్మీయా ద్వారా ప్రవచించెను (యిర్మీయా 31:31-34). క్రొత్త నిబంధన ఇయ్యబడినప్పుడు ఈ ప్రవచనము నెరవేరెను (హెబ్రీ 8:6-13). దేవుడు ఇశ్రాయేలీయుల కిచ్చిన ధర్మశాస్త్రము క్రింద నేడు మనములేము. మనము క్రీస్తు ధర్మశాస్త్రము క్రింద జీవించు చున్నాము. యేసుక్రీస్తు మన ప్రధాన యాజకుడు (హెబ్రీ 7:12). సీనాయి వద్ద ఇశ్రాయేలీయుల కీయబడిన పాత చట్టము క్రీస్తు సిలువపై మరణించగానే అంతమొందెను. "దేవుడు వ్రాత రూపకమైన ఆజ్ఞల వలన మనమీద ఋణముగాను, మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దాని మీద చేవ్రాతను తుడిచివేసి,

మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసెను" (కొలస్స 2:14).

యేసుక్రీస్తు మోషే ధర్మశాస్త్రము క్రింద జన్మించెను. దానిని ఆయన పరిపూర్ణముగా ఆచరించెను. అందువలననే ఆయన సమాజమందిరములలోను, దేవాలయములోను ఆరాధించెను. అపొస్తలులు కూడ తరుచు క్రీస్తును గూర్చి బోధించుటకు సమాజమందిరముల లోనికి వెళ్లేవారు. ఏలయనగా యూదులు క్రీస్తు కొరకు ఎదురు చూచుచుండిరి. అయితే అపొస్తలులు సబ్బాతు నాచరించుటకు కాదుగాని, క్రీస్తును బోధించే అవకాశమును నాడు వారు వినియోగించుకొనిరి.

క్రైస్తవులకు ఆదివారము ఆరాధన దినమని బైబిలు విశదీకరించు చున్నది. అపొస్తలుల కాలములోనే యిది ఆచరణలో యుండెను. కాన్స్టాంటిన్ చక్రవర్తి ఆరాధన దినమును శనివారమునుండి ఆదివారముకు మార్చెనని చెప్పుట అబద్ధము. క్రైస్తవులు దేవుని నారాధించుటకు ఆదివారమున కూడుకొనుచుండిరి గనుక ఆ దినమును చట్టరీత్యా సెలవు దినముగా కాన్స్టాంటిన్ ప్రకటించాడు, అంతే. శనివారమును ఆరాధన దినముగా ఆచరించువారు, ప్రకటించువారు అసత్యములో యున్నారు. క్రీస్తును నిజముగా వెంబడించువారు ఆయన అనుమతి బడసిన ఆదివారముననే ఆరాధింతురు.

## దైవారాధన - మానవుని తత్వం

## ( Worship and the nature of man )

మానవుడు దేవుని ఆరాధించాలని ఎల్లప్పుడు కోరతాడు. తన ఆరాధన ద్వారా దేవుని సాన్నిధ్యానికి చేరుకోడానికి అతడు ప్రయత్నిస్తాడు. దేవుడు ఆత్మయై యున్నాడు. గనుక ఆయన నారాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలని యేసుప్రభువు చెప్పారు (యోహాను 4:24).

ఆరాధనను గూర్చి క్రైస్తవులు సరియైన మన స్తత్వాన్ని కలిగియుండాలి. ఆరాధన చేసే సమయం అతి ఆనందాయక మైనదిగా క్రైస్తవులు ఎంచుకోవాలి. ఆరాధించే సమయాన్ని గూర్చి వారేమాత్రము సణుగకూడదు. దేవుని బిడ్డయైన వాడు ఆరాధనకు వెళ్లడానికి ఆసక్తితో ఎదురు చూస్తాడు. "యెహోవా మందిరమునకు

వెళ్లుదుమని జనులు నాతో అనినప్పుడు నేను సంతోషించితినని" దావీదు చెప్పాడు (కీర్తన 122:1). అందువలన నిజక్రైస్తవులు సంతోషంతో దేవుని ఆరాధిస్తారు.

దేవుని సత్యాన్ని బట్టి మానవుని ఆత్మ బలపడే సమయం ఆరాధన. దేవుని పరిశుద్ధతను బట్టి మానవుని అంతరాత్మ ఉత్తేజపరచబడతాది.మనం ప్రతి ప్రభువు దినాన్న ఆయననారాధించుటకు కూడినప్పుడు మన ఆరాధన ఎట్లుండాలో దాన్ని గూర్చి ఈరోజు కొంత తెలిసికొందము.

క్రైస్తవారాధన యొక్క మూలసూత్రాన్ని అర్థం చేసికోవాలంటే ఇంచుమించు 1500 సంవత్సరము మట్టుకు అమలులో యున్న యూదుల ఆరాధనను కొంతమట్టుకు మనం పునరాలోచించాలి. వారి ఆరాధన వారి ఆత్మీయాభివృద్ధితో ముడివడియున్నది. ఉదాహరణకు-పాతనిబంధనలో పశుబలులు వారి ఆరాధనలో ఒక భాగంగా యుండేవి. స్త్రీ పురుషులు తమ అర్పణలను దేవాలయం దగ్గరకు తెచ్చేవారు. ప్రజల పాపములకొరకు యాజకులు ఈ బలులర్పించేవారు. సంవత్సరాని కొకసారి ఇశ్రాయేలు ప్రజలందరి పాపపరిహారార్థమై ఒక బలి యర్పింపబడేది. ప్రతి సంవత్సరము యిది ప్రజలకు తమ పాపాలను జ్ఞప్తికి తెస్తూ యుండేది. దేవాలయములో సాంబ్రాణిపొగ లర్పించడం వారి ఆరాధనలో ఒక భాగంగా యుండేది.

ప్రత్యక్షపు గుడారపు ఆరాధనలో [illegible]దు వాద్య సంగీతాన్ని తెచ్చాడు (1ది.వృ 15,16 అధ్యా). వాద్యము అంతకుముందు ఆరాధనలో వినియోగించ బడలేదు. వారు చేసే ఆరాధనను బట్టి ఆనాటి ప్రజలు మరొక శ్రేష్టమైన యుగం లోనికి నడిపింపబడినట్లు బైబిలును చదువుట ద్వారా మనం తెలిసికోగలం.

## ఛాయ - నిజస్వరూపము

యూదుల ఆరాధన అంతయు క్రైస్తవారాధన యనే నిజరూపం యొక్క ఛాయగా కనబడును. హెబ్రీయులకు వ్రాయబడిన పత్రిక 8,9, 10 అధ్యాయాలు చదివితే యిది మనకు స్పష్టమవుతాది. ఆనాడు వారర్పించిన పశుబలులు దేవుడు తన ఏకైక కుమారునిలో అర్పించే బలియొక్క ఛాయయై యున్నవి. యేసు

తనకుతానే బలిగా అర్పించబడినప్పుడు ఇక పశుబలుల యొక్క అవుసరం యేమీ లేనేలేదు. యేసు పరిపూర్ణుడు, ఆయనలో ఏ విధమైన పాపము లేదు. ఆయన రక్తము చిందింపబడుట ద్వారా మానవజాతికి సంపూర్ణ విమోచన లభించింది.

పాతనిబంధన చట్టప్రకారము ఆరాధింపబడాలనే దేవుని కోరిక ఆనాటి ప్రజల ఆత్మీయాభివృద్ధిని బట్టి యున్నది. అయితే దానికి వేరైన ఆరాధన, ఆయన కోరేదినము రాబోవు చున్నది. పాతకాలములోవలే ఆయన ఆరాధన ఉండాలని కోరలేదు. అందువలననే, నీవు నేను పశుబలులర్పించము, సాంబ్రాణి పొగలు వేయము, వాద్యసంగీతము నుపయోగించము. క్రైస్తవులమైన మనము దేవుని నారాధించడానికి వచ్చునప్పుడు యూదులకంటె శ్రేష్టమైన స్థాయిలో, శ్రేష్టమైన యుగంలో యున్నామని గ్రహించాలి. ఇప్పుడాయన మన హృదయపూర్వకమైన ఆరాధనను కోరుచున్నాడు. ఏది చేసినా దేవుని మెప్పుకొరకే మనం చేయాలి. దేవుని ఆజ్ఞలన్నిటికీ విధేయత చూపాలి. అదే సత్యారాధన అవుతాది.

## సత్యారాధన

దేవుని ఆరాధించేవారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలని యేసుప్రభువు చెప్పారు. దేవునిని సత్యముతో ఆరాధించడం అంటే ఆయనను యధార్థంగా, ఆయన కోరిన రీతిగా వాక్య ప్రకారం ఆరాధించాలి. గాని చాలమంది ఆయన కోరిన రీతిగా గాక, వారు కోరుకున్న రీతిగానే ఆరాధిస్తున్నారు. అయితే వారి ఆరాధన వ్యర్థం. మన ఆరాధన సత్యముతో యుండాలంటే, దేవుడు తన గ్రంధములో ఆజ్ఞాపించిన రీతిగా యుండాలి. వెయ్యిమంది వెయ్యి రకాలుగా ఆరాధించాలని కోరవచ్చు. గాని దేవుడు కోరునట్లు చేయడమే మనకు ప్రాముఖ్యము.

తరువాత, మనం ఆత్మతో ఆరాధించాలని ప్రభువు కోరుచున్నాడు. ఆత్మతో ఆరాధించాలన్నప్పుడు ఆయన పరిశుద్ధాత్మను గూర్చి ఇక్కడ చెప్పలేదు గాని ఆరాధించేవాని మనస్తత్వాన్ని గూర్చి ఆయన చెప్పాడు. "ప్రభువు దినమందు ఆత్మవశుడనై యుంటిని" యని యోహాను చెప్పాడు (ప్రక1:10). అతని భావం యేమిటి? ఆరోజు అతడు ప్రభుని ఆరాధించడానికి సరియైన మనసు, లేక ఆత్మ కలిగియున్నాడు. ఆ సందర్భములో యోహాను ఆత్మీయంగా దేవునితో లీనమై యున్నాడు.

"దేవా, నాయందు శుద్ధహృదయము కలుగజేయుము. నా అంతరంగములో స్థిరమైన మనస్సును నూతనముగా పుట్టించుము" అని దావీదు ప్రార్థించినప్పుడు పరిశుద్ధాత్మ కొరకు అతడు ప్రార్థించలేదు. దైవారాధన కొరకు అతనిలో యుండతగిన స్వభావము కొరకు అతడు ప్రార్థించాడు (కీర్తన 51:10).

దైవారాధనలో మనం సరియైన మనస్సు కలిగియుండాలని ఆయన కోరుచున్నాడు. అయితే ఆయన కోరే మనస్సు ఎటువంటిది? "విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలులు. దేవా, విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు" అని దావీదు చెబుతున్నాడు (దా.కీర్త. 51:17). మరల "ఎవడు దీనుడై నలిగిన హృదయము గలవాడై నామాటవిని వణకుచుండునో వానినే నేను దృష్టించుచున్నానని" యెషయా ద్వారా ప్రభువు పలికాడు (యెషయా 66:2). నేను గొప్పవాడిని, నాలో పాపం యేమీలేదు అని నీవనుకొనుచున్నట్లయితే నీవు శుద్ధమనస్సు కలిగిన వాడవు కావు. నీవెంత గొప్పవాడవైనను సరే, అత్యంత గొప్పవాడైన దేవుని నీవు సేవించాలి. నీవెంత విజయవంతుడవైనను సరే, దేవుని యెదుట నీవు విరిగి నలిగిన మనస్సు కలిగియుండాలి.

దేవుని నారాధించేటప్పుడు దేవునిపై నీవు కేవలము ఆధారపడి యుండాలి. ఆయన లేకపోతే నీవు నిస్సహాయుడవే. నేటి ప్రపంచములో మాకు దేవుడక్కర్లేదను కొనేవారు కొందరున్నారు. అయితే అనుక్షణం మనందరికీ ఆయన అవుసరమున్నది. దేవుడు లేకుండా నీవు జీవితంలో సాధించేది శూన్యం. మీకు నాకు దేవుడు అవుసరం. అందువలననే ప్రతి ఆదివారం ప్రభురాత్రి భోజనంలో పాలుపుచ్చుకొని ప్రభువు మన పాపముల నిమిత్తము బలి అయ్యాడని జ్ఞాపకం చేసికొనడం మన కవుసరం.

దైవారాధన నీకొక విధమైన ఆనందాన్ని కలుగజేయాలి. దేవుని వాగ్దానములు సంతోషకరమైనవి. సత్యారాధనద్వారా ఆ వాగ్దానములను నీవుకూడ పొందవచ్చు. క్రీస్తుద్వారా ఆయన నీ పాపములను క్షమించాడని తెలిసికోవడం సంతోషం. ఆయన నిన్ను ఎన్నడూ విడువడని, ఎడబాయడని తెలిసికోవడం సంతోషం. ఆయనే నీ కేడెము, నీ దుర్గము. ఆయన ఒకానొకప్పుడు తన నిత్యగృహానికి

పరలోకానికి నిన్ను తీసికొని వెళ్తాడని తెలిసికోవడం సంతోషం. ఆరాధనను నీవు ఈ దృక్కోణంతో చూచినప్పుడు, దైవారాధన నీకెంత అవుసరమో నీవే తప్పక గ్రహించగలవు. అందువలననే క్రైస్తవులు దేవుని ఆరాధన కొరకు సంతోషంతో ఎదురు చూస్తారు. ఆరాధన యెడల సరియైన మనస్సు కలిగిన వాడు దాన్ని మానుకొనడు (హెబ్రీ 10:25). నీవు క్రైస్తవుడవై ప్రభువును ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవచ్చును. యేసుప్రభువునందు విశ్వాసముంచి, ఆయన ఆజ్ఞలకు ఈనాడే లోబడుము. ఈరోజే ప్రభువు నిన్ను తన సంఘముతో చేర్చుకొంటాడు.

- జాషువా గూటం.

## 666: మృగము యొక్క సంఖ్య

### ( 666, The Number of the Beast )

### ప్రకటన 13:11-18

ప్రకటన 13:11-18 వరకు గల వాక్యభాగాన్ని వివరించుటకు అనేకులు ఎంతో సమయాన్ని వెచ్చించారు. ఈ వాక్యభాగము యొక్క భావాన్ని కొందరు గొప్ప ఆర్భాటముతో ప్రకటించారు. మనందరం జ్ఞానుల వలెనే యుండాలని కోరుదుము. "బుద్ధిగలవాడు మృగము యొక్క సంఖ్యను లెక్కింపనిమ్ము.... ఇందులో జ్ఞానము కలదు" యని ఆ లేఖనముభాగము చెప్పుచున్నది. అయితే సత్యమేమేంటే అనేకులు వివిధరకాల బావార్ధములు చెప్పుచు పరిస్థితిని గజిబిజి చేసేసారు.

యెహోవాయందు భయభక్తులు కలిగియుండుటయే జ్ఞానమునకు మూలము. ప్రకటన గ్రంథములో అలంకార భాషలో చెప్పబడిన సంగతులు మనకున్నవి. అందువలన ఈ అలంకార భాషకు భావార్థము చెప్పుటలో దేవుని వాక్యాన్నే ఆధారం చేసికొనకపోతే, మన వివరణ కుప్పకూలిపోవును. గనుక సాధ్యమైనంత మట్టుకు బైబిలునుండియే మనం దీని వివరణను సంగ్రహించుదాం.

బైబిలులో అనేకచోట్ల చెప్పబడిన సందర్భములకు ప్రకటన 13వ అధ్యాయము ఆఖరి భాగములో చెప్పబడిన సంగతులకు ప్రత్యక్ష సంబంధమున్నట్లు అగుపడును. మృగములను గూర్చి దానియేలు గ్రంధములో పెక్కుగా చెప్పబడినది. దానియేలు యిచ్చిన వివరణకు ప్రకటన గ్రంధములో చెప్పబడిన మృగములకు చాల సన్నిహిత సంబంధమున్నది. అలాగే 2 థెస్సలోనికయులకు, 1,2తిమోతి పత్రికలు, 1,2 యోహాను పత్రికలను కూడ జాగ్రత్తగా గమనించాలి.

పూర్వకాలమందు నానా సమయములలోను, నానా విధములుగాను ప్రవక్తల ద్వారా దేవుడు మన పితరులతో మాటలాడెనని హెబ్రీ 1:1 తెలియ జెప్పుచున్నది. దానియేలు ఉన్న సమయం ఆ నానా సమయములలో ఒక్కటి. నానా విధములుగా మాట్లాడిన దానిలో స్వప్నముల ద్వారా మాటలాడుట ఒకటి. యోసేపు ఫరో కల యొక్క భావమును చెప్పెను. హేరోదు నుండి పారిపొండని యేసు యొక్క తలిదండ్రులు స్వప్నము ద్వారా హెచ్చరించబడిరి. దానియేలు గ్రంధము కలలయొక్క భావము తెలియజెప్పుటలో భారీగా కేంద్రీకృతమై యున్నది. ఆ కలలలో ఏవేవో గురుతులు భారీయెత్తున కనబడ్డాయి. అందువలన వాటి ఖచ్చిత భావం తెలిసికొనుట కొంత క్లిష్టముగా యగుపడును.

## దానియేలు గ్రంధము-స్వప్నములు

దానియేలు గ్రంధములో స్వప్నములో కనబడిన మృగములను జాగ్రత్తగా పఠించుట కారంభించెదము. బబులోను చెరకాలములో దానియేలు జీవించి ప్రవచించెను. దానియేలు యొక్క మొదటి దినాల్లో నెబుద్నెజరు ఏలుబడి చేసెను. తన ఏలుబడి రెండవ సంవత్సరములో నెబుకద్నెజరు ఒక కల కనెను. ఈ కలలో మృగములను గూర్చి చెప్పబడలేదు గాని, మిగతా కలలలో మృగములను గూర్చి చెప్పబడెను. అందువలన నెబుకద్నెజరు యొక్క కలను మనము పఠించాలి. రాజు దగ్గరనున్న జ్ఞానులెవరును ఆకల యొక్క భావమును చెప్పలేకపోయిరి. అయితే యెహోవా దేవుని శక్తివలన దానియేలు రాజు కనిన కలను దాని భావమును కూడ చెప్పగల్గెను.

రాజు ఒక బ్రహ్మాండమైన ప్రతిమను చూచెను. ఆ ప్రతిమ యొక్క శిరస్సు మేలిమి బంగారు మయమైనదియు, దాని రొమ్మును భుజములును వెండివియు, దాని ఉదరమును తొడలును ఇత్తడివియు, దాని మోకాళ్లు ఇనుపవియు, దాని పాదములలో ఒక భాగము ఇనుపదియు ఒక భాగము మట్టిదియునై యుండెను. మరియు చేతి సహాయము లేక తీయబడిన ఒక రాయి, యినుమును మట్టియు కలిసిన ఆ ప్రతిమ యొక్క పాదముల మీదపడి దాని పాదములను తుత్తునియలుగా విరుగగొట్టెను. అంతట ఇనుమును, మట్టియు, ఇత్తడియు, వెండియు బంగారమును ఏకముగా దంచబడి కళ్ళెములోని చెత్తవలెకాగా వాటికి స్థలము ఎచ్చటను దొరుక కుండ గాలివాటిని కొట్టుకొని పోయెను. ప్రతిమను విరుగగొట్టిన ఆరాయి సర్వభూతలమంత మహా పర్వతమాయెను (దానియేలు 2:31-35).

దానియేలు ఆ కలకు ఇట్లు భావము చెప్పెను: ఆ ప్రతిమ యొక్క వివిధ భాగములు, వివిధ రాజ్యములు. నెబుకద్నెజరు పాలించుచున్న బబులోను సామ్రాజ్యము మేలిమిబంగారు శిరస్సు. దీని తరువాత మూడు వేర్వేరు రాజ్యములు వచ్చును. ఆ రాజ్యములు వచ్చును, పోవునుగాని పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యమును స్థాపించును. అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయునుగాని అది యుగ యుగములు నిలుచును (దానియేలు 2:36-45).

నెబుకద్నెజరు కుమారుడైన బెల్షస్సరు యొక్క ఏలుబడి మొదటి సంవత్సరములో దానియేలు తావే ఒక కల కనెను. ఆకాశపు నలుదిక్కులనుండి సముద్రము మీద గాలి విసురుట అతనికి కనబడెను. అప్పుడు నాలుగు మిక్కిలి గొప్ప జంతువులు మహా సముద్రములోనుండి పైకెక్కెను. ఆ జంతువులు ఒకదానికొకటి భిన్నముగా వుండెను. మొదటిది సింహమును పోలినది గాని దానికి పక్షిరాజు రెక్కలుండెను. రెండవది ఎలుగుబంటిని పోలియుండెను గాని అది విస్తారముగా మాంసము భక్షించుచుండెను. మూడవది చిరుతపులిని పోలినది; దానికి నాలుగు తలలుండెను, వీపున నాలుగు రెక్కలుండెను. నాలుగవది ఘోరమును, భయంకరము నైనదై సమస్తమును భక్షించుచు, తుత్తునియలుగా చేయుచు మిగిలిన దానిని

కాళ్లక్రింద అణగద్రొక్కుచుండెను. దానికి పది కొమ్ములుండెను. వాటి మధ్య ఒక చిన్న కొమ్మునకు మానవులవంటి కన్నులుండెను మరియు గర్వముగా మాటలాడు నోరుండెను (దానియేలు 7అధ్యా). ఒక మహావృద్ధుడు తీర్పునకు వచ్చి ఆ ఘోర మృగమును అగ్నిలో పడవేయువరకు దానియేలు చూచెను. మొదటి మూడు మృగములు వాటి యొక్క ప్రభుత్వము వాటినుండి తీసివేయబడెను. అయితే నాలుగవ మృగమునకు తీర్పు జరిగిన తరువాత కూడ కొంతకాలము అవి యుండెను. అప్పుడు ఆకాశమేఘారూఢుడై మనుష్యకుమారుని పోలిన యొకడు ఆ మహావృద్ధుని సన్నిధిని ప్రవేశించెను. ఆయనకు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఈయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది. ఆయన రాజ్యము ఎన్నడు లయముకాదు. దానిలో సకల జనములు రాష్ట్రములు, ఆయాభాషలు మాట్లాడువారుండి ఆయనను సేవింతురు (దానియేలు 7:1-14).

దానియేలుకు కలిగిన దర్శనమును బట్టి కలవరపడి దాని భావము తెలిసికొనగోరెను. ఈ నాలుగు మృగములు ప్రభుత్వము చేయు నాలుగు రాజ్యములను సూచించెను. భయంకరమైన నాలుగవ మృగమును గూర్చి, దాని చిన్న కొమ్మును గూర్చి దానియేలు తెలిసికొనగోరెను. ఆ నాలుగవ జంతువు సమస్తమును అణగద్రొక్కుచు, పగులగొట్టుచు లోకమంతయు భక్షించునట్టి ఒక రాజ్యమని చెప్పబడెను. ఈ రాజ్యములో ఒక రాజు పుట్టి సర్వోన్నతునిపై తిరుగుబాటు చేయును. అతడు పరిశుద్ధులతో యుద్ధము చేయగా వారు ఒక కాలము, కాలములు అర్ధకాలము అతని వశమున నుంచబడుదురు. అయితే తీర్పు వచ్చును. అతని ప్రభుత్వమును తీసివేయబడును. సమస్తాధికారము సర్వోన్నతుని కీయబడును. ఆయన పరిశుద్ధులు ఆయన రాజ్యము యొక్క ఘనతను అనుభవింతురు. సకలజనులు ఆయనను సేవింతురు; ఆయనకు విధేయులై యుందురు.

రెండు సంవత్సరముల తరువాత రాజగు బెల్షస్సరు ప్రభుత్వపు మూడవ సంవత్సరమందు దానియేలుకు మరొక దర్శనము కలిగెను. అది అతనికి కలిగిన మొదటి దర్శనము గాక మరియొకటి. ఆదర్శనములో రెండుకొమ్ములుగల యొక

పొట్టేలును అతడు చూచెను. ఆ కొమ్ములు ఒకదానికంటె మరియొకటి ఎత్తుగా నుండెను. ఆ పొట్టేలు కొమ్ముతో పశ్చిమముగాను, ఉత్తరముగాను, దక్షిణముగాను పొడుచుకొని వచ్చుచుండెను. దానిని ఎదిరించుటకు ఎవనికిని శక్తి లేకపోయెను. అది తనకిష్టమైనట్టుగా జరిగించుచు బలము పొందెను. దానియేలు ఇంకను చూచుచుండగా ఒక మేకపోతు పడమట నుండి వచ్చెను. దాని రెండు కన్నుల మధ్య నొక ప్రసిద్ధమైన కొమ్ము ఉండెను. అది పొట్టేలును ఢీకొని దాని రెండు కొమ్ములను పగులగొట్టెను, దానిని నేలమీద పడవేసి త్రొక్కుచుండెను. మేకపోతు యొక్క పెద్దకొమ్ము విరిగెను. విరిగిన దానికి బదులుగా నాలుగు ప్రసిద్ధమైన కొమ్ములు పెరిగెను. ఈ కొమ్ములలో యొక దానినుండి యొక చిన్న కొమ్మొులిచి గొప్పదాయెను. ఈ చిన్న కొమ్ము ఆకాశపు సైన్యాధిపతిని ఎదిరింప మొదలిడెను. అదివారిలో కొందరిని పడద్రోసి అణగద్రొక్కుచుండెను. అతడు పరలోకాధిపతిని సయితము ఎదిరించునంత మట్టుకు తన్నుతాను హెచ్చించుకొనెను (దానియేలు 8వ అధ్యా).

ఈ చిన్న కొమ్ము అనుదిన బల్యర్పణమును నిలిపివేసి ఆయన ఆలయమును పడద్రోసెను. ఆ చిన్న కొమ్ము యొక సేనను తయారుచేసుకొని సత్యమును వ్యర్థ పరచుచు అభివృద్ధినొందెను. పరిశుద్ధులలో యొకడు ఎన్నాళ్లవరకు ఈ దుష్టత్వము జరుగునో యని మాటలాడు కొనుట దానియేలు వినెను. ఈ దర్శనము యొక్క భావమును దానియేలు గ్రహించులాగున గాబ్రియేలు దూత అతని యొద్దకు పంపబడెను.

ఈ దర్శనము అంత్యకాలమును గూర్చినదని గాబ్రియేలు దానియేలుకు తెలియజేసెను. అతడు చూచిన రెండు కొమ్ములుగల పొట్టేలు మాదీయుల యొక్కయు, పారసీకులయొక్కయు రాజులను సూచించెను. మేకపోతు గ్రేకులరాజు. దాని పెద్దకొమ్మువారి మొదటి రాజు. దాని తరువాత వచ్చిన నాలుగు కొమ్ములు మొదటి రాజు తరువాత వచ్చు నాలుగు రాజులు. వారి ప్రభుత్వము యొక్క అంతములో క్రూరముఖుడును యుక్తి పరుడైన యొక రాజు వచ్చును. అతడు పరిశుద్ధులను నాశనము చేయును. తన్నుతాను గొప్పగా హెచ్చించుకొనును.

అతడు రాజాధిరాజుతో యుద్ధము చేయును గాని దైవాధీనము వలన అతని బలము కొట్టివేయబడును.

దానియేలు గ్రంథము 11వ అధ్యాయములో మరల కొన్ని భవిష్యత్ సంఘటనలతో దేవుని దూత దానియేలుకు ప్రత్యక్షమాయెను. ఇప్పుడు దక్షిణదేశపు రాజుకును ఉత్తరదేశపు రాజుకును గొప్ప సంఘర్షణ జరిగెను. ఉత్తరదేశపు రాజు అందరి కంటే పైగా తన్నుతాను హెచ్చించుకొనెను. అతడు తన యిష్టానుసారముగా జరిగించుచు, దేవాతిదేవునికి వ్యతిరేకముగా మాటలాడెను. అతడు మహిమ గల పర్వతము మీద తన రాజభవనమును నిర్మించుకొనెను. అయితే తుదకు అతడు నశించును. అతనికి ఎవరు సహాయము చేయలేకపోయిరి.

ఈ సంగతులు అంత్యకాలమునకు వర్తించినవని దానియేలుకు తెలియ జేయబడెను. దానియేలు ఈ మాటలను గ్రంథస్థము చేసి అంత్యకాలము వరకు ముద్రవేసి యుంచవలెను. ఈ యాశ్చర్యము ఎప్పుడు సమాప్తమగునని యిద్దరు తమలో తాము మాటలాడు కొనుట దానియేలు వినెను. ఒకకాలము, కాలములు, అర్ధకాలము మట్టుకు పరిశుద్ధజనము చెదరిపోవుట మట్టుకు అని దానికి జవాబీయ బడెను.

## దేవునిరాజ్యముతో మానవరాజ్యముల ఘర్షణ

దానియేలు గ్రంథమంతటిలోను, మృగముల వంటి మానవ రాజ్యములకు, నిత్యదేవుని రాజ్యమునకు సంభవించు గొప్ప పోరాటమును దానియేలు దర్శనము ద్వారా చూడగల్గెను. యెహోవా దేవుని వ్యతిరేకించు రాజ్యములు మానవ జ్ఞానమును బట్టి అతిశయించుచు దేవుని శక్తిని జ్ఞానమును దూషించుచు చుండెను. రాజులకు రాజు, సర్వోన్నతుడు, మనుష్యకుమారుడు మొదలగు పదములు తరుచు మనకు పరిచయము చేయబడెను. అంత్యదినములలో క్రీస్తుకును, అంత్యక్రీస్తు యొక్క ఆత్మకును మధ్య జరుగబోవు గొప్ప పోరాటమును దానియేలు దర్శనము ద్వారా చూడగల్గెను. ప్రవక్త గొప్పగా కలతజెందెను. అతడు నిలకడగా యుండిన యెడల విశ్రాంతినొంది కాలాంతమందు తన వంతులో నిలిచెదవని అతనికి తెలియ జేయబడెను (దానియేలు 11,12అధ్యా).

ఇప్పుడు మనం క్రొత్త నిబంధనలోనికి వద్దాం. దానియేలు ప్రవచనములు యదార్ధములని తెలుసుకొంటాము. బబులోనీయుల తరువాత మాదీయ పారసీక రాజ్యములు వచ్చెను. మాదీయపారసీకుల తరువాత గ్రీకులు పరిపాలించిరి. అటు తరువాత శక్తివంతమైన రోమా సామ్రాజ్యము వచ్చెను. ఈ రాజ్యములన్నియు మానవజ్ఞానము, శక్తిపై ఆధారపడియుండెను. ఈ రాజ్యములు వచ్చి వెళ్లుచు యుండగా, పరలోకమందున్న దేవుడు పెంతెకొస్తు దినమున తన రాజ్యమును స్థాపించెను. అది ఒక చిన్న రాయివలె ఆరంభించెను. అది మానవజ్ఞానమును బట్టి గాని, మానవశక్తి, భుజబలమువలన గాని ఏర్పడలేదు. గాని అదొక గొప్ప పర్వతమై భూతలమంతయు వ్యాపించి యుండును.

అయితే ప్రతిఘటన లేకుండా అది జరుగదు. "అన్యజనులు ఏల గల్లత్తు చేయుచున్నారు?" అని 2వ దావీదు కీర్తనలో వ్రాయబడి యున్నది. ఈ గల్లత్తు అంతయు, దేవుని పరిశుద్ధ పర్వతముపైన తన సింహాసనమందు కూర్చుండబెట్ట బడిన దేవుని కుమారునిపై కేంద్రీకృతమై యున్నది. మనుష్యులు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదని దేవుడు మనకు తెలియజేసియున్నాడు. దీనిని మానవులంగీకరించుట చాలకష్టము. అంత్యక్రీస్తు యొక్క ఆత్మను ప్రేరేపించుటలో అపవాది మానవుని అహంభావమును పూర్తిగా వినియోగించుకొనును. ఇట్టి స్వభావము వలన మానవుడు దేవునికి వ్యతిరేకి యగును. దేవుని కంటే పైగా తన్నుతాను హెచ్చించుకోగలనని మానవుడు మోసగించబడును.

## క్రీస్తువిరోధి(anti christ)

ఈ అంత్యక్రీస్తు స్వభావ లక్షణములను కొన్నింటిని గమనించుదము: యేసుప్రభువు కొందరు వేషధారులను గూర్చి యిట్లు చెప్పెను: "మనుష్యులు కల్పించిన పద్దతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్ధముగా ఆరాధించుచున్నారు" (మత్తయి 15:9). క్రీస్తు యొక్క కుమారత్వమును గూర్చిన బోధను అనేకులు హేళన చేసారు. యేసేప్రభువని ఒప్పుకొనుటలో ఒకడు తన్నుతాను తగ్గించుకొనును. అనేకులు అట్లు చేయరు.

నాశనమునకు పోవు విశాల మార్గమున అనేకులు పయనించుచున్నారు. గనుక, దాని పర్యవసానము భయంకరము. పౌలు తిమోతికి ఇట్లు వ్రాసాడు: "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మల యందును, దయ్యముల బోధయందును లక్ష్యముంచి విశ్వాసభ్రష్టు లగుదురు....." (1తిమోతి 4:1,2). "ఎందుకనగా జనులు హిత బోధను సహింపక దురద చెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమకొరకు పోగుచేసికొని సత్యమునకు చెవి ఇయ్యక కల్పనాకథలవైపు తిరుగుకాలము వచ్చును" (2తిమోతి 4:3,4). "అయితే దుర్జనులును వంచకులును ఇతరులను మోసపరచుచు తామును మోసపోవుచు అంతకంతకు చెడిపోవుదురు" (2తిమోతి 3:13).

థెస్సలోనికయులకు వ్రాయుచు పౌలు ఇట్లు చెప్పెను: "మీరు త్వరపడి చంచల మనస్కులు కాకుండవలెననియు, బెదరకుండ వలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడను బట్టియు, మనము ఆయన యొద్ద కూడుకొనుటకు బట్టియు మిమ్మును వేడుకొనుచున్నాను. మొదట భ్రష్టత్వము సంభవించి నాశనపాత్రుడగు పాపపురుషుడు బయలు పడితేనేగాని ఆ దినము రాదు. ఏది దేవుడనబడునో ఏది పూజింపబడునో, దానినంతటిని ఎదిరించుచు, దానికంతటికి పైగా వాడు తన్నుతానే హెచ్చించుకొనును, తాను దేవుడనని తన్ను కనుబరచు కొనును దేవుని ఆలయములో కూర్చుండును గనుక ఏవిధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచ నియ్యకుడి. నేనింకను మీ యొద్ద ఉన్నప్పుడు ఈ సంగతు లను మీతో చెప్పినది మీకు జ్ఞాపకములేదా? కాగా వాడు తన సొంత కాలమందు బయలు పరచబడవలెనని వానిని అడ్డగించుచున్నది ఏదో అది మీరెరుగుదురు. ధర్మవిరోధ సంబంధమైన మర్మము ఇప్పటికే క్రియచేయుచున్నది గాని,యిదివరకు అడ్డగించు చున్నవాడు మధ్యనుండి తీసివేయబడువరకే అడ్డగించును. అప్పుడా ధర్మవిరోధి బయలు పరచబడును. ప్రభువైన యేసు తన నోటి యూపిరిచేత వానిని సంహరించి తన ఆగమన ప్రకాశము చేత నాశనము చేయును. నశించుచున్న వారు తాము రక్షింపబడుటకై సత్యవిషయమైన ప్రేమను అవలంబింపక పోయిరి

గనక వారిరాక అబద్ధ విషయమైన సమస్త బలముతోను, నానా విధములైన సూచక క్రియలతోను, మహత్కార్యములతోను దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను నశించుచున్న వారిలో సాతాను కనువరచు బలమును అనుసరించి యుండును" (2థెస్స 2:3-10).

## పాప పురుషుడు

పైన చెప్పబడిన లేఖన భాగములోని పాప పురుషుడు, రోమన్ కేథలిక్కుల పోపు సమానులని కొందరు తలస్తారు. 'పాప పురుషుడు' అనుపదము దీనికంటే సామాన్యమైనది. దైవజనుడు అనేపదాన్ని మనం వినియోగించునప్పుడు ఒక ప్రత్యేక వ్యక్తిని ఉద్దేశించి మనం చెప్పము. సరిగదా దేవునికి నమ్మకమైన సేవచేయు వానెవనికైనను ఆ పదము వర్తించును. 2థెస్స 2:3-10 వచనములు దేవుని సంఘములో యున్న అంత్యక్రీస్తు ఆత్మను వర్ణించుచున్నవి. ఈ అంత్యక్రీస్తు దేవునిదైన ప్రతిదానిపైనను తన్నుతాను హెచ్చించుకొనును. మానవకల్పిత సిద్ధాంతములను బోధించుటలోను ఆచరించుటలోను అతడు తన స్వంత నియమముల నేర్పరచును. అతడు దేవుని కుమారునికి వ్యతిరేకియైన నాశనపుత్రుడు. పౌలు దినములలో ఈ దుష్టుడు బలపడుటకు సరిపడినంత సమయం లేకపోయెను. అయితే అతడు బయల్పడినప్పుడు మాత్రం సమస్త బలముతో బయల్పడును. అతడు అబద్ధ విషయమైన సూచక క్రియలను మహత్కార్యములను కనుబరచును.

రోమన్ కేథలిక్ సంఘము తాను పొరబాటు పడదగనిదని చెప్పుకొనుటలోను, దాని "సూచకక్రియలలోను", పోపును అది ఆరాధించుటలోను ఈ పాపపురుషునిలో భాగమైయున్న దనుటలో సందేహము లేదు. అయితే క్రీస్తు శరీరము (సంఘము) లోనుండి ఉద్భవించు అంత్యక్రీస్తు యొక్క ఆత్మయే ఈ పాపపురుషుడు. దానియేలు దర్శనమందు చూచిన మృగ సంబంధమైన రాజ్యములకును, ఈ పాపపురుషునికిని యున్న సారూప్యములను మనం గమనించకుండ యుండలేము. తరువాత మనం 1యోహాను 3:23 నుండి 4:6వరకు గమనించుదము. "క్రీస్తువిరోధి ఆత్మ" అను పదము ఈ లేఖనభాగములో వినియోగింపబడెను: ఆయన ఆజ్ఞ యేదనగా-ఆయన కుమారుడైన యేసుక్రీస్తు నామమును నమ్ముకొని, ఆయన

మనకు ఆజ్ఞనిచ్చిన ప్రకారముగా ఒకనినొకడు ప్రేమింపవలెననునదియే. ఆయన ఆజ్ఞలను గైకొనువాడు ఆయన యందు నిలిచి యుండును. ఆయన వానియందు నిలిచియుండును. ఆయన మనయందు నిలిచియున్నాడని ఆయన మన కనుగ్రహించిన ఆత్మమూలముగా తెలిసికొనుచున్నాము. ప్రియులారా అనేకులైన అబద్ధప్రవక్తలు లోకములోనికి బయలువెళ్లియున్నారు. గనుక ప్రతి ఆత్మను నమ్మక ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి. యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని యే ఆత్మ ఒప్పుకొనునో, అది దేవుని సంబంధమైనది; యే ఆత్మ దేవుని ఒప్పుకొనదో అది దేవుని సంబంధమైనది కాదు. దీనిని బట్టియే దేవుని ఆత్మను మీరెరుగుదురు. క్రీస్తు విరోధి ఆత్మ వచ్చునని మీరు వినిన సంగతి యిదే. యిదివరకే అది లోకములో ఉన్నది. చిన్నపిల్లలారా మీరు దేవుని సంబంధులు; మీలో ఉన్నవాడు లోకములో ఉన్నవానికంటే గొప్పవాడు గనుక మీరు వారిని జయించి యున్నారు. వారులోక సంబంధులు గనుక లోక సంబంధులైనట్టు మాటలాడుదురు. లోకము వారి మాట వినును,మనము దేవుని సంబంధులము; దేవుని ఎరిగినవాడు మనమాట వినును, దేవుని సంబంధికానివాడు మనమాట వినడు. ఇందువలన మనము సత్య స్వరూపమైన ఆత్మయేదో, భ్రమపరచు ఆత్మయేదో తెలిసికొనుచున్నాము".

క్రీస్తు విరోధి (antichrist) ఒక వ్యక్తికాదని ఈ లేఖనభాగమును బట్టి విశదమగుచున్నది. యేసుక్రీస్తు యొక్క కుమారత్వమును, ఆయన మానవ రక్షణార్థమై శరీరధారియై వచ్చెనని నిరాకరించు వారందరును క్రీస్తు విరోధులే. క్రీస్తు యొక్క అధికారమునకు లోబడక, ఆయన ఆజ్ఞలను పాటించనొల్లని వారందరు క్రీస్తు విరోధులే. వారు రక్షకుని చిత్తము యెదుట తమ చిత్తమును లోబరచనొల్లరు. ఇంకోమాటలో దేవునికంటె తమ జ్ఞానమును వారు హెచ్చించు కొందురు.

రెండవదిగా, యోహాను పై సంగతులతో ఏకీభవించుచున్నాడు: "మనమాయన ఆజ్ఞల ప్రకారము నడచుటయే ప్రేమ; మీరు మొదటనుండి వినిన ప్రకారము ప్రేమలో నడుచుకొనవలెను అనునదియే ఆ ఆజ్ఞ. యేసుక్రీస్తు శరీధారియై

వచ్చెనని యొప్పుకొనని వంచకులు అనేకులు లోకములో బయలుదేరియున్నారు. అట్టివాడే వంచకుడును, క్రీస్తు విరోధియై యున్నాడు" (2యోహా: 6,7).

"చిన్నపిల్లలారా, యిది కడవరి గడియ. క్రీస్తు విరోధి వచ్చునని వింటిరిగదా. ఇప్పుడును అనేకులైన క్రీస్తు విరోధులు బయలు దేరియున్నారు. ఇదికడవరి గడియ అని దీనిచేత తెలిసికొనుచున్నాము" (1యోహా 2:18). యేసేక్రీస్తని నిరాకరించువాడు తప్ప అబద్ధికుడెవరు? తండ్రిని కుమారుని నిరాకరించువాడు క్రీస్తువిరోధి. క్రీస్తు యొక్క అధికారమును మాటచేతగాని, క్రియచేతగాని ధిక్కరించు వాడెవడైనను సరే అంత్యక్రీస్తు లేక క్రీస్తువిరోధి.

మనము గమనించిన దానివి బట్టి రాజకీయము గాను, మతపరముగాను కూడ దేవుని రాజ్యమును, ఆయన కుమారుని నిరాకించుచు వారిపై పోరాటము జరిగించు శక్తులు బయలుదేరును. అట్టిది సంభవించునని దానియేలు ప్రవచించాడు. అపొస్తలులైన పౌలు, యోహానులుకూడ అట్లే ప్రవచించారు. అట్టి గర్వాంధులు నాశనమగుదురు. దేవుని రాజ్యము విజయము సాధించును. దేవుని చిత్తము గౌరవించబడును.

## విజయవంతుడైన క్రీస్తు

ఇప్పుడు ప్రకటన గ్రంధములోనికి వెళ్లుదము. ఆరవ అధ్యాయములో సువార్తపై స్వారీచేయుచు విజయము సాధించుచున్న క్రీస్తు ప్రవేశించుట చూడగలము. మానవులు త్వరలోనే ఆయనను నిరాకరించగా యుద్ధము, కరవు మరణమును మనము చూడగలము. మానవులు క్రీస్తు విరోధులగుట వలన యిది సంభవించెను. బూరధ్వని ద్వారా దేవుడు మానవులను హెచ్చరించెను గాని మానవులు ఆ హెచ్చరికను లెక్కచేయలేదు. ప్రకటన గ్రంథము 12వ అధ్యాయములో క్రీస్తు, ఆయన సంఘము పరిచయము చేయబడెను. క్రీస్తులోకములో ప్రవేశించగానే సాతానుడు ఆయనను నాశనము చేయనెంచెను. దేవుడు క్రీస్తును పరలోకమందున్న ఆయన సింహాసనము మీదికి కొనిపోగా, సాతానుడు ఆయన సంఘమును హింసించెను.

యెహోవా దేవుడు సంఘము(అనుసంస్థను) కలిగియున్నట్లే అపవాదికూడ క్రీస్తు విరోధి సంస్థను (anti Christian Organisation) కలిగియున్నాడు. సముద్ర క్రూరమృగము ఒకటియుండెను. అనగా మానవ డంబముపై ఆధారపడిన ప్రభుత్వము అది. మరియు అబద్ధ ప్రవక్తయుండెను. అనగా మానవజ్ఞానముపై ఆధారపడిన మతము అది. అక్కడ బబులోను, అనగా అపవాది యొక్క ముఖ్యపట్టణము వున్నది. భూరాజులు దానిని పాలింతురు. అపవాది పక్షమున తమ్ముతాను తాము చేరిన వారందరు క్రీస్తు విరోధులు. యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని వారు నిరాకరింతురు. వారు మానవుని శక్తి, జ్ఞానమును బట్టి నడుచుకొనుటకు నిశ్చయించుకొన్నవారు.

## వంచకుడైన సాతానుడు

ప్రకటన గ్రంథము 13వ అధ్యాయము దగ్గరకు వచ్చుసరికి క్రీస్తువిరోధి (anti Christ ) పూర్ణముగా అభివృద్ధిజెందుట మనం చూడగలము. ఏదెనులో చెప్పబడిన గొప్ప అబద్ధమే సత్యమని అపవాది దాని అనుసరించు సమూహమును నమ్మించగలిగెను. నిజమైన స్వాతంత్ర్యము, సంతృప్తి దేవుని ఆజ్ఞలకు లోబడుట వలన గాక మానవ యిచ్ఛను బట్టి నడుచుకొనుటవలననే కలుగునని మానవుడు భావించుచున్నాడు. యిలాగ గజిబిజి చేయబడిన ప్రజలలోనుండి సముద్ర క్రూరమృగమైన ప్రభుత్వము లేచెను. అది మానవశక్తిపై ఆధారపడి పనిచేయునది. దేవుని ఆలయములోనుండే సాతానుడు అబద్ధ ప్రవక్తను ఎంచుకొనెను. బబులోను పురవాసులగునట్లు సాతానుడు అనేకులను మోసపుచ్చెను. వారందరికీ సమానమైనది ఒక్కటే, వారందరు క్రీస్తు విరోధులు.

ప్రకటన గ్రంథము 13వ అధ్యాయములో ఆఖరిభాగమునకు వచ్చుసరికి క్రీస్తువిరోధి ఆత్మ శిఖరాగ్రమునకు చేరుకొనెను. ఎవరైతే క్రీస్తువిరోధి ఆత్మను ప్రదర్శించరో వారు సమాజములో ఏకాకివలె యగుపడునట్లు సాతాను ప్రజలను ఘోరముగా మోసగించెను. మానవులలో బహుసంఖ్యాకులు మానవ దృక్కోణపు భావములకు అవలంబించిరి. వారు సాతానుకు దాసులమై పోతిమని గ్రహించ

కుండిరి. వారు తమ మట్టుకు తామే దేవుండ్లమని తలంచిరి. దేవుడులేడు, మానవుడే దేవుడు. వారు తమ్ముననుతామే ఘనపరచుకొనిరి, తమకొరకే సేవచేసి కొనిరి. సాతానుడు సంతోషించాడు. వారు అతనివారు.

దేవుడు తనవారిని పరిశుద్ధాత్మతో నొసళ్ల మీదట ఎట్లు ముద్రవేయునో, సాతానుడు తనవారిని నొసళ్లమీదను, కుడిచేతిమీదను ముద్రవేయును. వారి యజమానుడెవరో సంశయం యేమీవుండదు. నొసళ్లమీద ముద్ర వేయబడుట యనగా ఒకదాని నిమిత్తము మనస్సును, చిత్తమును సమర్పించుకొనుట యని అర్థము. కుడిచేతిమీద ముద్రవేయబడుట యనగా ఒకపని చేయుటకు, జరిగించుటకు నిశ్చయించుకొనుట. ప్రకటన 13:16-18లో సాతాను పరిచారకులు తమ మనస్సును శరీరమును కూడ క్రీస్తుకు వ్యతిరేకముగా ఉపయోగింపబడుటకు ప్రతిష్ఠించుకొనిరి.

## 666 అనగా యేమి?

వారిపై వేయబడిన గురుతు పలు విధములుగా చెప్పబడినది. అది మృగము పేరని, దాని పేరిట సంఖ్యయని చెప్పబడినది. అది మనుష్యుని సంఖ్యయని చెప్పబడినది. అసలు 666 అను సంఖ్యతో ముద్రవేయబడుట యనగా యేమిటి? ఈ పై మూడు వచనముల మీదనే ఆధారపడి అర్థం చెప్పాటంటే మనకు కష్టముగా యుండును. నిజానికి ఈ వ్యాసం అంతటిలోను మనయొద్ద ఎంతో సమాచారాన్ని సేకరించి యుంచాము.

ఏడు అనుసంఖ్య లేఖనములలో ప్రాధమికముగా సంపూర్ణత్వమును సూచించును. ఏడుదినముల సృష్టి జరిగిన వారమున్నది. ఏడుముద్రలు, దేవుని సింహాసనము ఎదుట ఏడు ఆత్మలు, ఆసియాలోని ఏడు సంఘములు, ఏడుబూరలు, ఏడుఉరుములు, ఏడుపాత్రలు మొదలైనవి యున్నవి. ఆరు అనుసంఖ్య పరిపూర్ణతకు లోపించిన సంఖ్య. మానవుడు ఆరవ దినమున సృజింపబడెను. 666 అను సంఖ్య మూడింతలుగా చెప్పబడిన అసంపూర్ణతను సూచించుచున్నది. మానవుడు దేవుడు కాదు.

ప్రాముఖ్యమైన వాస్తవం యేమంటే 18వ వచనములో, ఆదిమ గ్రీకుభాషలో "యొక మనుష్యుని సంఖ్య" అన్నప్పుడు 'యొక' అనునదిలేదు. అది యొక మనుష్యుని సంఖ్యకాదు గాని మనుష్యుని సంఖ్యయే. గనుక ఏదో ఒక మనుష్యుని పేరుకు, ఈ సంఖ్యను వర్తింపచేయుట పొరబాటు. ఈ వచనము యొక్క మూలం యేమంటే, మానవుడే సమాస్తానికి కేంద్రీకృతమై యున్నాడని సాతానుడు మానవుని నమ్మించాడు. సముద్రమృగము, భూమృగము, అబద్ధప్రవక్తలు మానవస్వేచ్ఛాను సారమైన తత్వమును బట్టియు, క్రీస్తుకు వారు లోబడక పోవుటను బట్టియు ప్రబలుదురు. మానవజీవపు డంబమును తమ నొసళ్లమీదను, తమకుడిచేతి మీదను వేయించుకొనిన వారు లేకపోతే ఈ అపవాది పరిచారకులు మృతులు.

మృగము యొక ముద్ర, మృగము యొక్క నామము, మృగము యొక్క సంఖ్య, ఇవన్నియు ఒకటే. అవన్నీ మానవడంబమును, మానవసంఖ్యను, 666ను సూచించును. దానియేలు దానిని 'చిన్నకొమ్ము' గా దర్శనములో చూచెను. పౌలు దానిని "పాపపురుషునిగాను" "ధర్మవిరోధిగాను" చూచెను. యోహాను దానిని "క్రీస్తు విరోధి ఆత్మగా" 1,2యోహాను పత్రికలలో చూచెను. మరియు ప్రకటన గ్రంధములో మనుష్యుని సంఖ్య యగు 666 గా దానిని అతడు చూచెను (ప్రక 13:16-18).

ప్రకటన గ్రంధములోని మిగతా అధ్యాయములు మృగము యొక్క ముద్ర కలిగిన వారి యొక్కయు, అంధకార సంబంధ రాజ్యశక్తుల యొక్కయు ఘోరనాశనమును వర్ణించును. దుష్టునినుండి దేవుడు మనలను విడుదల చేయును గాక!

- లియోన్ డి. స్టేన్క్లిఫ్, USA.

# 13వ ఏషియన్ బైబిలు లెక్చరర్‌షిప్ మరియు
# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ బైబిలు సెమినార్

## ఆహ్వానము

**తేదీలు : 1997 డిశంబరు 7 నుండి 12 వరకు**
**ఆదివారం నుండి శుక్రవారం వరకు**

**స్థలము : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ - సెమినార్ హాలు**
**ఫోర్డ్ స్ట్రీట్, విద్యుత్‌నగర్, కాకినాడ - 533 003.**

**ముఖ్యాంశము : "యేసుక్రీస్తు దేవుని కుమారుడు"**
**Theme : "Jesus Christ, the Son of God "**

గత 12 సంవత్సరములుగా ఆసియా ఖండములో వేర్వేరు దేశములలో జరుగుచున్న లెక్చరర్‌షిప్ ఈ సంవత్సరము భారతదేశములో పైనుదహరించిన తేదీలలో జరుగబోవుచున్నది. ఆసియాలోని 10 లేక 14 దేశములనుండి వచ్చిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సువార్తికులు "యేసుక్రీస్తు దేవుని కుమారుడు" అనే అంశముపై గొప్ప ప్రసంగములనందించబోవుచున్నారు. మరియు భారతదేశమునుండి ఇంచుమించు అన్ని రాష్ట్రముల వారు ఇందు పాల్గొనబోవుచున్నారు. యిది మన జీవితములో సంభవింపబోవుచున్న గొప్ప ఆనందదాయకమైన సమయం, సహవాసం. గనుక ఇందులో పాల్గొనుటకు ఇప్పటినుండి సిద్ధపడండి. ప్రార్థన చేయండి. వివరములకు ఈ దిగువ సంప్రదించండి.

నెహెమ్యా గూటం
**Convenor of the Seminar**
**P. O. Box. 57,**
**Kakinada - 533 001**
**Ph : 0884 - 64882 / 72604.**

జాషువా గూటం
**Director of the Lectureship**
**P. O. Box. 80,**
**Kakinada - 533 001**
**Ph : 0884 - 63697 / 63722.**

వివిధ జిల్లాలనుండి ఘువార్తికులు అధికసంఖ్యలో తరలివచ్చిరి. "సంఘమునకు శిరస్సు ఎవరు? క్రీస్తా లేక పోపా ? రాజ్యము సంఘము ఒక్కటేనా?" అను అంశము చర్చింపబడెను.

ఉదయం ప్రారంభమైన సమావేశమునకు సోదరులు జి.షద్రక్‌గారు మధ్యాహ్న సమావేశమునకు సోదరులు పి.జె. కృపాలినిగారు అధ్యక్షులుగా నుండి చర్చను సమర్దవంతముగా నడిపించిరి సోదరులు యు.స్టాలిన్, డి.ఇశ్రాయేలురాజు, వి.హిట్లర్, యన్.జె. మోహన్‌రావ్, యన్.మోజెస్. ఇ.కె.వి. ప్రసాదరావ్, కె.తాతారావ్, మరియు జి.నాటీసెయింట్ గార్లు చర్చలో పాల్గొనిరి.

జగత్తు పునాది వేయబడక మునుపే దేవుని మనస్సులో సంఘమును గూర్చిన ఆలోచన ఉండెను (ఎఫెసీ 1:4-6). క్రీస్తు తన స్వరక్తముతో సంఘమును సంపాదించెను (అపొ.కా. 20:28). దానికొరకు క్రీస్తు తన్నుతాను అప్పగించుకొనెను (ఎఫెసీ 1:18). క్రీస్తు శరీరమునకు (సంఘమునకు) రక్షకుడై యున్నాడు (ఎఫెసీ 5:23). క్రీస్తు ప్రేమించిన తన వధువునకు ఆయన శిరస్సయి ఉండగా, ఆ వధువు పరిశుద్ధమైదిగా, నిర్దోషమైనదిగా, మహిమగలదిగా ఉండాలని ఆయన ఆశించు చున్నాడు. ముడతయైనను, కళంకమైనను అట్టిది మరియేదైనను లేని సంఘమై యుండాలని వాక్యముతో సంఘమును పవిత్రపరచి, పరిశుద్ధ పరచుటకై దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను (ఎఫెసీ 5:25).

పోపునకు సంఘమునకు ఎట్టి సంబంధము లేదు. ఎవడైనను క్రీస్తు శిరస్సునకు బదులు పోపును నియమిస్తే అది నాశనమునకు కొనిపోవు మానవకల్పిత మతశాఖ అవుతుంది. "మొదట భ్రష్టత్వము సంభవించి నాశన పాత్రుడగు పాపపురుషుడు బయలు పడితేనేగాని ఆదినము రాదు. ఏది దేవుడనబడునో, ఏది పూజింపబడునో దానినంతటిని ఎదిరించుచు, దానికంతటికి పైగా వాడు తన్నుతానే హెచ్చించుకొనుచు, తాను దేవుడనని తన్ను కనుపరచుకొనుచు దేవుని ఆలయములో కూర్చుండును గనుక ఏ విధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచ నియ్యకుడి" (2థెస్స 2:3-4).

పరిశుద్ధ గ్రంధమును చీకటిలో దాచిపెట్టి, సంఘమును భ్రష్టత్వమునకు నడిపించి, క్రీస్తు అధికారమును తమ చేతులలోనికి తీసికొని ధనసంపాదనకై

పాపపరిహార పత్రములు అమ్మినవారు ధర్మవిరోధులు. ఆ మార్గంలో నడవాలని ఆశించేవారు క్రీస్తు విరోధులు.

రోమా రాజుల కాలములో దేవుడు ఎన్నటికిని నాశనము కాని రాజ్యమును స్థాపించెను. ఆరాజ్యము తాను పొందినవారికి మాత్రమే చెందును. అది శక్తివంతమైనది, శాశ్వతమైనది, మహిమాన్వితమైనది. అదియే క్రీస్తుసంఘము (దాని. 2:44). శిష్యులు జీవించియున్న కాలమందే బలముతో వచ్చిన రాజ్యమది (మార్కు 9:1). "పరలోకరాజ్యము యొక్క తాళపుచెవులు" అనగా క్రీస్తు సువార్తయే. పేతురు బోధించిన మొట్టమొదటి సువార్త ప్రసంగమే 3000మంది క్రీస్తుసంఘ సభ్యులగుటకు అవకాశమిచ్చింది. రాజ్యము, సంఘము, ఒక్కటేఅని సువార్తికులు నిర్ద్వంద్వముగా తెలియజేసిరి.

సోదరులు కె. నీలకంఠశర్మగారు 25 సం॥రాలుగ పుల్లేటికుర్రు ప్రాంతంలో కష్టించి పనిచేయుచున్నారు. వారు చక్కని ప్రార్థనామందిరమును ఆరాధనకొరకు నిర్మించిరి. శర్మగారు వారి కుటుంబము మరియు స్థానిక సంఘము చక్కని ఆతిథ్యమిచ్చి సదస్సును ఘనంగా నిర్వహించిరి.

---

Regd. No. H / KD-45 / K.D. H.O
Date of Posting : 15 th of Every month

**From:**
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA - 533 001

**To**